క్లుప్తంగా

గోందళ్ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రంగ్రీజులు వీధిలో ఉన్న శ్రీ అంబా భవాని అమ్మవారి ఆలయంలో నగరానికి చెందిన భావసార్ క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో గోందళ్ ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రభాత భేరి, భండారా పూజలు, అమ్మవారికి ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సమాజ్ పూజ, సమాజ సభ్యుల గోత్ర నామాలతో విశేష పూజలు చేశారు. 5 గంటల నుంచి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు గోందళ్ ఉత్సవం, అనంతరం ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమాలను భావసార్ క్షత్రియ సంఘం అధ్యక్షుడు కాలే శ్రీనివాసరావు, కార్యదర్శి గుజ్జరు మార్కండేయులు, కోశాధికారి టేకాళే గిరి, గుజ్జరు రమణ పర్యవేక్షించారు.

సకాలంలో జీతాలు చెల్లించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జూన్ నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.రామ్మోహన్‌రావు, జి.మోహన్‌రావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కొత్త క్యాడర్ స్ట్రెంత్‌ను రాష్ట్రవ్యాప్తంగా వెంటనే కన్ఫాం చేయాలని డిమాండ్ చేశారు. వివరాలన్నింటినీ ట్రెజరీ విభాగానికి తద్వారా సీఎఫ్ఎంఎస్ విభాగానికి చేరేటట్లు చూడాలని కోరారు.

పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ

దెందులూరు: విద్యతోనే అవగాహన అభివృద్ధి ముడిపడి ఉందని పాలగూడెం గ్రామ సర్పంచ్ పి.సునీత అన్నారు. మంగళవారం పాలగూడెం యూపీ పాఠశాలలో 120 మంది విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి పి.సురేంద్ర, ఎంపీటీసీ బి.మణమ్మ, తూతా నిరంజన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు బత్తుల అప్పారావు, నాయకులు బి.గోకనేసు, బెజవాడ రామారావు, తదితరులు ఉన్నారు.

గంజాయి, సిగరెట్ల విక్రయాలపై తనిఖీలు



స్వాధీనం చేసుకున్న గుట్కా, సిగరెట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: ఆపరేషన్ సేవ్ క్యాంపస్ జోన్‌లో భాగంగా ఏలూరులో పలు దుకాణాలపై పోలీస్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. భారీగా గుట్కా, మత్తు పదార్థాలు, సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈగల్ టీమ్ ఐజీ రవికృష్ణ, ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు పోలీస్ సబ్ డివిజన్లలో తనిఖీలు నిర్వహించారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల దూరంలో ఎలాంటి మత్తుపదార్థాలు, సిగరెట్లు, గంజాయి విక్రయాలు చేయకుండా చర్యలు చేపట్టామని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు తెలిపారు. ఏలూరులోని సీఆర్ఆర్ విద్యాసంస్థలు, ఎన్ఆర్‌పేట, వట్లూరు వివిధ ప్రాంతాల్లో మత్తుపదార్థాలు, సిగరెట్లు, గుట్కాలు వంటివి విక్రయించుకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ దాడులు జిల్లా వ్యాప్తంగా కొద్ది రోజులు కొనసాగుతాయని తెలిపారు. దాడుల్లో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు సీఐలు అశోక్‌కుమార్, కోటేశ్వరరావు, ఎస్సై రాంబాబు, ఆర్ఎస్ఐ ఉదయ భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ సూర్యచక్ర, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రజల మదిలో వైఎస్సార్ సుస్థిరం

- వాడవాడలా వైఎస్సార్ జయంతి
- భారీ అన్నదాన కార్యక్రమాలు
- మహిళలకు చీరల పంపిణీ



ఫైర్‌స్టేషన్ సెంటరులో జోహార్లర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు



సెయింట్ థెరిస్సా కళాశాల సెంటరులో నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు టౌన్: దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి, సంక్షేమ పాలనతో రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఏలూరు నగరం, నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నేతలు, శ్రేణులు, అభిమానులు ఉత్సాహంగా నిర్వహించారు. కేకులు కోశారు. భారీ అన్నదానాలు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సారథ్యం వహించిన వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పార్టీ ఏలూరు కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు.

సేవా కార్యక్రమాలు

మార్కెట్ యార్డ్ ప్రాంతంలోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీఎంఆర్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంచారు. కొడేలు వంతెన ప్రాంతం, ఫైర్‌స్టేషన్ సెంటర్, సెయింట్సు మహిళా డిగ్రీ కాలేజీ సెంటర్, వంగాయగూడెం సెంటర్, చిరంజీవి బస్‌షెల్టర్, తూర్పువీధి గంగానమ్మ గుడి సెంటర్, వెన్నవల్లివారిపేట నాలుగు రోడ్ల కూడలి, బీడీ కాలనీ ప్రధాన రహదారి వద్ద మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వంగాయగూడెం సెంటర్, తూర్పువీధి చాటపర్రు రోడ్డు, బీడీకాలనీ దేవీబార్ సమీపంలో, ఐదో డివిజన్ ఐబీఎం చర్చి ప్రాంతంలో పేదలకు అన్నదానం చేశారు.

సంక్షేమ సారథి

ఈ సందర్భంగా సమన్వయకర్త జయప్రకాష్ మాట్లాడుతూ సంక్షేమ పాలన అంటే ఇలా ఉండాలంటూ చేసి చూపిన గొప్ప సంక్షేమ పాలకుడు డాక్టర్ వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన హయాంలో ఆరోగ్యశ్రీ పథకానికి రూపకల్పన చేసి వేలాది గుండెలకు ప్రాణం పోశారని, అత్యవసర సేవలకు 108 అంబులెన్స్‌లు, గ్రామాల్లో ప్రజలకు ఉచిత వైద్యానికి 104 సంచార వైద్యశాలలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ప్రతి పేదవాడు ఉచితంగా ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పక్కాగా అమలు చేశారని, పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేశారని తెలిపారు. వైఎస్ తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మరోసారి రాష్ట్ర ప్రజలు స్వర్ణయుగాన్ని చూశారని వివరించారు. నేడు మరోసారి చీకటి రోజులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి, ముస్లిం మైనార్టీ పిల్లలు విద్య, ఉద్యోగాల్లో మెరుగైన అవకాశాలు కల్పించిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్ బాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను అక్కునచేర్చుకుని వారికి సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేశారని తెలిపారు.

మహిళా సాధికారతకు కృషి

బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎంఆర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్థిరపడుతూ వారి కుటుంబాలను పోషించుకునేందుకు డ్వాక్రా రుణాలు, సున్నా వడ్డీ వంటి పథకాలు అమలు చేశారని చెప్పారు. కార్యక్రమాల్లో పార్టీ ఏలూరు మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, కార్పొరేటర్లు తుమరాడ స్రవంతి, ఇమ్మానియేల్ జయకర్, ఇనపనూరి కేదారేశ్వరి, నిర్మల జ్యోతి, డింపుల్ జాబ్, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్, బీసీ సెల్ ఏలూరు నగర అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, ఎస్సీ సెల్ ఏలూరు నగర అధ్యక్షుడు ఇనపనూరి జగదీష్, లీగల్‌సెల్ ఏలూరు నగర అధ్యక్షులు ప్రత్తిపాటి తంబి, వాణిజ్య విభాగం కార్యదర్శి భాస్కర్ల బాచి, సీనియర్ నాయకులు గేదెల సూర్యప్రకాష్, గ్జేవియర్ మాస్టారు, లంకలపల్లి గణేష్, కొల్లిపాక సురేష్, పిట్టా ధనుంజయ్, మాచర్ల లోకేష్, బండ్లమూడి సునీల్‌కుమార్, దాలి వెంకటేష్, కిలాపరపు బుజ్జి, ఎండీ కైసర్, పాతినవలస రాజేష్, గంటా సాయిప్రదీప్, ప్రభాకర్, స్టాలిన్, ప్రత్తిపాటి విక్టర్, షమీ, దాసరి రమేష్, బుద్దాల రాము, పాతినవలస బాలాజీ, తదితరులు ఉన్నారు.

ఘనంగా వైఎస్ జయంతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యదర్శి కాలి వెంకట రామారావు ఆధ్వర్యంలో స్థానిక ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య నగరపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోషల్ స్టడీస్ మెటీరియల్ ప్రధానోపాధ్యాయుడు ఉన్నమట్ల కాంతి జయకుమార్ ద్వారా పంపిణీ చేశారు. వెంకట రామారావు మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ హయాంలో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు.

- జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. వైఎస్ రైతు పక్షపాతి అని కొనియాడారు.
- సత్రంపాడులోని రాజశేఖరరెడ్డి విగ్రహం సెంటర్లో వైఎస్సార్ సీపీ నాయకుడు నూకపెయ్యి సుధీర్‌బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు.

పైడి చింతపాడులో..

దెందులూరు: పేద బడుగు, బలహీన, గిరిజన, దళిత వర్గాల అభ్యున్నతికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవ చరిత్రలో నిలిచిపోతుందని వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ అన్నారు. ఏలూరు రూరల్ మండలం పైడి చింతపాడులో ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, పార్టీ నాయకులు చిన్న సుగుణరావులతో కలిసి డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకు కట్ చేశారు. పల్లెం ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ చేసిన పాదయాత్ర దేశమంతా ఆదర్శప్రాయంగా మారిందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.



స్వీట్లు పంచుతున్న కార్యకర్తలు



దెందులూరు: నివాళులర్పిస్తున్న ముంగర సంజీవ్‌కుమార్



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైఎస్ఆర్ టీఏ నాయకులు



సత్రంపాడు సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు



పార్టీ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జయప్రకాష్



వంగాయగూడెం సెంటరులో కేక్ కట్ చేస్తున్న జేపీ, కార్పొరేటర్లు



వంగాయగూడెం సెంటరులో విగ్రహానికి పూల మాల వేస్తున్న జేపీ

ఏజెన్సీ సమస్యలపై 10న సీపీఎం పర్యటన



ఎ.రవి

ఏలూరు (టూటౌన్): ఏజెన్సీ ప్రాంత సమస్యలపై సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఈనెల 10వ తేదీన పర్యటించనున్నట్టు సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. మంగళవారం స్థానిక పవరుపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 10న గురువారం ఏజెన్సీ ప్రాంతంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో రాష్ట్ర, జిల్లా నాయకుల పర్యటిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు జీలుగుమిల్లి మండల కేంద్రం నుంచి ప్రారంభమయ్యే ఈ పర్యటన అక్కడి ఎల్‌టీఆర్, 1/70 చట్టం భూముల పరిశీలనతో పాటు 11 గంటలకు అంకంపాలెం చేరుకొని ఆర్ అండ్‌ఆర్ మిగుల భూముల పరిశీలన చేస్తారని వివరించారు. అనంతరం బుట్టాయిగూడెం, రెడ్డి గణపవరం ప్రాంతాల్లోని ఆర్‌అండ్‌ఆర్ భూముల అమ్మకాల ప్రతిపాదిత భూముల పరిశీలన, ఇనుమూరు గ్రామంలో ఎల్‌టీఆర్, 1/70 భూముల పరిశీలన ఉంటుందన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనాల పరిశీలిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు పోలవరం ప్రాజెక్టుని పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం అక్కడి నుంచి దేవీపట్నం రాష్ట్ర బృందం చేరుకుంటుందన్నారు. ఈ పర్యటనలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పింఛన్ మంజూరు చేయాలి



డీఆర్ఓ విశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): 50 సంవత్సరాలు నిండిన వివిధ చేతి వృత్తిదారులకు నెలకు రూ.5000 పింఛన్ మంజూరు చేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య ఏలూరు జిల్లా కో కన్వీనర్ ఫోటేలు పెంటయ్య , బీకేఎంయూ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ చేతి వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా నాయకులు ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. దరఖాస్తు చేసుకున్న చేతి వృత్తిదారులందరికీ వయసుతో నిమిత్తం లేకుండా సొంత పూచి కత్తుతో బీసీ, ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా రూ.2 లక్షలకు తగ్గకుండా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం చేతి వృత్తిదారులకు మంజూరు చేయాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కులం పేరుతో చేస్తున్న దాడుల నుంచి చేతి వృత్తిదారులకు రక్షణ కల్పించాలని, సామాజిక భద్రతా చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుగ్గల ప్రభాకర్, అరిగెల రాజు పాల్గొన్నారు.

నేడు కార్మికుల భారీ ప్రదర్శన



సమ్మె కరపత్రం విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): మోదీ సర్కార్ తీసుకొచ్చిన లేబర్ కోడ్ల రద్దు, మార్కెట్ యార్డుల పరిరక్షణ, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రభుత్వ రంగాలను పరిరక్షించాలని కోరుతూ బుధవారం నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ ఏలూరు మార్కెట్ యార్డ్ రిక్షా పుల్లర్స్ వర్కర్స్ యూనియన్ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు కరపత్రాన్ని యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. పవర్‌పేట రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 10 గంటలకు భారీ ప్రదర్శన, ఆర్ఆర్ పేట వెంకటేశ్వర స్వామి గుడి వద్ద భారీ సభ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మీసాల వెంకటరమణ, ఏసు, నాగు, నాయుడు, రాజు, సాయి, సంతోష్, నాని, శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా కార్యదర్శి షేక్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా, మండల కేంద్రాలు, గ్రామాల్లో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని కార్మికులను కోరారు.

జర్నలిస్ట్ ఫెడరేషన్ సంఘీభావం

ఏలూరు (టూటౌన్): కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సార్వత్రిక సమ్మెకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తోందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌డీ జబీవుల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపు చట్టాలతో పాటు 44 చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపట్టిన సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

ఏలూరు (టూటౌన్): సార్వత్రిక సమ్మెకు సీపీఐ పూర్తి మద్దతు ప్రకటిస్తోందని సీపీఐ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ తెలిపారు. కొండేటి బేబీ అధ్యక్షతన ఆర్ఆర్‌పేట స్ఫూర్తి భవన్‌లో మంగళవారం నిర్వహించిన సీపీఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు గొర్రెల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, కొల్లూరి సుధారాణి, గొర్లి స్వాతి, శాయన అభిలాష్ కుమార్, కొండేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో రైతులు పాల్గొనాలి

ఏలూరు (టూటౌన్): సమ్మెలో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో జరుగుతున్న ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాల్లో రైతాంగం పాల్గొని విజ్ఞప్తి చేశారు.

ఉర్దూనా లేక ఇంగ్లిష్ మీడియమా నిర్ధారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు పర్వీన్ బేగం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని తూర్పువీధి నగరపాలక పాఠశాల ఉర్దూ మీడియమా లేదా ఇంగ్లిష్ మీడియమా అనేది విద్యాశాఖాధికారులు నిర్ధారించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఏఆర్‌డీజీకే నగరపాలక ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం యూటీఎఫ్ ఏలూరు నగర శాఖ అత్యవసర కార్యవర్గ సమావేశం నగర అధ్యక్షురాలు షేక్ పర్వీన్ బేగం అధ్యక్షతన నిర్వహించారు. యూటీఎఫ్ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి రవి కుమార్ హాజరై మాట్లాడారు. పాఠశాల ఉర్దూ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యి ఉర్దూ పోస్టులు మంజూరు అయ్యాయా లేదా అని విద్యాశాఖ నిర్ధారించాలని, తూర్పు వీధి ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉన్న విద్యార్థులందరూ హిందూ, క్రిస్టియన్ విద్యార్థులే అని ఇంగ్లిష్ మీడియం మాత్రమే కొనసాగేదని తెలిపారు. ఉర్దూ చదవడం, రాయడం రాని పిల్లలు ఉన్న పాఠశాలను ఇటీవల పదోన్నతుల్లో ఉర్దూ ఉన్నత పాఠశాలగా యూడైస్ ప్రకారం ఏలా మార్పు చేశారని ప్రశ్నించారు. దీనిపై విచారణ చేసి నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. విచారణలో సదరు పాఠశాల ఉర్దూ ఉన్నత పాఠశాల కాదని తేలితే ఆ పాఠశాలను ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలగా కొనసాగిస్తూ ఉర్దూ మాధ్యమంలో పదోన్నతి పొందిన వారికి రివర్షన్ ఇచ్చి కామన్ సీనియారిటీ ప్రకారం తదుపరి సీనియర్స్‌కు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ నగర శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	18
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' విడుదల



మేనిఫెస్టో కరపత్రం విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కరపత్రాన్ని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ ఏలూరు రూరల్ మండలం అధ్యక్షుడు తేరా ఆనంద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల శ్రేణులు ప్రజల్లోకి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తీసుకువెళ్లాలన్నారు. అధికారమే పరమావధిగా ఆచరణ అమలు కాని హామీలు ఇచ్చి ఏడాదైనా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. విజనరీ, 40 ఏళ్ల అనుభవం అంటున్న చంద్రబాబు మహిళలకు, నిరుద్యోగ యువతకు, రైతులకు అన్ని వర్గాల ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. హామీలు త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. వివక్షత లేకుండా అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మేక లక్ష్మణరావు, ఫారెస్ట్ వడ్డీల కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్లు పల్లెం ప్రసాద్, ప్రభాకర్ రావు, సర్పంచులు సునీత, నవ్య, ప్రభుదేవా, వర్రి నారాయణరావు, లక్ష్మీదుర్గ, నాయకులు నిరంజన్, గారపాటి నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మి, దేవానంద్, తోట పద్మారావు, కార్యకర్తలు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు శిక్ష

ఏలూరు టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడిన వ్యక్తులను కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారని ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొతూరు గ్రామానికి చెందిన కుర్రా శ్రీనివాసరావుకు ఏడు రోజుల జైలు శిక్ష, మరో ఐదుగురికి రూ.7 వేలు చొప్పున జరిమానా విధించారని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.